


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ ఆదివారం 31-03-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 87 పేజీలు : 4 వెల : రూ 2-00

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం

హైదరాబాద్,ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షేక్పేట ద్వారకామయి నగర్ లో మెయిన్ రోడ్డు వద్ద కరెంటు స్తంభాలకు ఉన్న వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్నిప్రమాద చోటుచేసుకుంది.. ద్వారక మెయిన్ రోడ్డు ఉన్న కరెంటు స్తంభాలకు వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతోనే అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. స్థానికులు గమనించి విద్యుత్ అధికారులకు తెలియజేయడంతో సుమారుగా రెండు గంటల పాటు కరెంటు నిలిచిపోయింది. స్థానిక ప్రజలు గమనించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు

# పీవీకి భారతరత్న



న్యూఢిల్లీ, మార్చి 30 దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భారతరత్న పురస్కరాలను ప్రదానం చేశారు. దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు తరఫున ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. కాగా.. పలు రంగాల్లో అసాధారణ సేవలందించిన వారికి భారత ప్రభుత్వం భారతరత్నను ప్రదానం చేస్తోంది. అయితే, ఈ ఏడాది ఐదుగురు ప్రముఖులకు మూడు విడతల్లో అత్యున్నత పురస్కారం 'భారతరత్న'ను ప్రకటించింది. ఈ ఏడాదికి బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకుర్, బీజేపీ అగ్రనేత ఎల్‌కే అడ్వాణీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, మాజీ ప్రధాని చౌదరీ చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌లకు భారతరత్నను ప్రకటించారు. ఒకే సంవత్సరంలో ఎక్కువమందికి దేశ అత్యున్నత పురస్కారం ప్రకటించడం ఇదే తొలిసారి. ఇందులో నలుగురికి మరణానంతరం ఈ అవార్డు లభించగా.. నేడు వారి కుటుంబసభ్యులకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. కర్పూరీ ఠాకుర్ తరఫున ఆయన కుమారుడు రామ్‌నాథ్, చౌదరీ చరణ్ సింగ్ తరఫున ఆయన మనవుడు జయంత్ సింగ్, స్వామినాథన్ తరఫున అవార్డును కుమార్తె నిత్యా రావు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, అమిత్ షా పలువురు కేంద్రమంత్రులు హాజరయ్యారు. కాగా.. ఎల్‌కే అడ్వాణీ అనరోగ్య సమస్యలతో బాధపడుతూ అవార్డు ప్రదానోత్సవానికి హాజరుకాలేకపోయారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అడ్వాణీ ఇంటికెళ్లి 'భారతరత్న' ను ప్రదానం చేయనున్నారు. తెలుగు ఠీవి అయిన పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని గడిచిన నెల 9న ప్రకటించింది కేంద్రం. దేశాన్ని మలుపు తిప్పిన నాయకుడిగా పీవీ నరసింహారావుకు ఈ దేశ ప్రస్థానంలో కీలకమైన స్థానం ఉంది. 1991లో దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు, ఆయన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఆర్థికరంగ నిపుణుడు డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించారు పీవీ నరసింహారావు. పండితుడు, రాజనీతిజ్ఞుడు అయిన పీవీ నరసింహారావు దేశానికి పలు హోదాల్లో సేవలు అందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఎంపీగా, అసెంబ్లీ సభ్యుడిగా ఎన్నో ఏళ్లు బాధ్యతలు నిర్వర్తించారు పీవీ నరసింహా రావు. దేశం ఆర్థికంగా పురోగమించ్డానికి ఆయన దార్శనిక నాయకత్వం ఉపయోగపడింది. దేశాభివృద్ధికి పీవీ నరసింహారావు పటిష్ఠమైన పునాదులు వేశారు. సరళీకరణ విధానాలతో ప్రపంచ మార్కెట్లకు పీవీ తలుపులు తెరిచారు. భారత విదేశాంగ విధానానికి, భాషకు, విద్యారంగానికి ఆయన సేవలు అపారమైనవని భారత రత్న ప్రకటించిన సందర్భంగా ప్రధాని మోదీ కొనియాడారు.

### మహిళలకు గుడ్ న్యూస్..

# రూ.5 లక్షలు వడ్డీ లేని రుణం



ఇంటికి దీపం ఇల్లాలు అంటారు. మహిళ అభ్యున్నతి సాధిస్తే ఆ కుటుంబం, అలాగే సమాజం కూడా ప్రగతి పథంలో పయనిస్తుంది. అందుకే మహిళా సంక్షేమానికి, వారి ఆర్థిక ఉన్నతికి ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెడుతున్నాయి. వాటి ద్వారా స్త్రీలు తమ కాళ్ల మీద తాము నిలబడేలా ప్రోత్సహిస్తున్నాయి. వివిధ శిక్షణా కార్యక్రమాలతో వారికి ఉపాధి కల్పిస్తున్నాయి. అన్ని విధాలా అండగా నిలబడుతున్నాయి. ఇదే క్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో ఢిల్లీలో మహిళల కోసం లక్షపతి దీదీ యోజన అనే పథకాన్ని ప్రకటించారు. దీని ద్వారా మహిళలను లక్షాధికారులను చేయాలన్నదే ఆయన లక్ష్యం. ఈ పథకం ద్వారా మహిళలకు ఉపాధి శిక్షణ ఇస్తారు. తమ కాళ్లపై నిలబడేలా ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక సాయం అందజేస్తారు. తద్వారా వారు ఆదాయ వనరులను కల్పించుకోవడానికి, పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ లక్షపతి దీదీ యోజన పథకం అంటే ఏమిటి? దానిలో ప్రయోజనాలు ఏమిటి? ఎవరు ఈ పథకానికి అర్హులో ఇప్పుడు తెలుసుకుందాం..

## జోధ్‌పూర్ లోక్‌సభ స్థానంలో నామినేషన్ దాఖలు చేసిన కేంద్రమంత్రి



లోక్‌సభ తొలి విడత ఎన్నికల నామినేషన్‌ల గడువు ముగియగానే ఈ నెల 28న రెండో విడత నామినేషన్‌ల ప్రక్రియ మొదలైంది. మొత్తం 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రెండో విడత లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ లోక్‌సభ స్థానంలో కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ నామినేషన్ వేశారు. శనివారం మధ్యాహ్నం తన సన్నిహితులు, అనుచరులతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లిన గజేంద్రసింగ్ షెకావత్.. రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. కాగా, లోక్‌సభ రెండో విడత ఎన్నికలు ఏప్రిల్ 26న జరగనున్నాయి. ఫలితాలను జూన్ 4న వెల్లడించనున్నారు.

## లిక్కర్ కేసు.. ఢిల్లీ మంత్రిని విచారించిన 'ఈడీ'



న్యూఢిల్లీ: లిక్కర్ కేసులో ఆమ్‌ఆద్మీపార్టీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నీడలా వెంటాడుతోంది. ఇప్పటికే ఈ కేసులో పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన ఈడీ తాజాగా ఢిల్లీ ప్రభుత్వంలోని మరో మంత్రి కైలాష్ గెహ్లాట్‌ను శనివారం విచారించింది. రద్దయిన వివాదాస్పద లిక్కర్ పాలసీ 2021-22 రూపొందించడంలో కైలాష్‌గెహ్లాట్ కూడా కీలకంగా వ్యవహరించారు. లిక్కర్ పాలసీ రూపకల్పన కోసం ఏర్పాటు చేసిన ప్యానెల్‌లో గెహ్లాట్ సభ్యులుగా ఉన్నారు. లిక్కర్ పాలసీని అధికారికంగా వెల్లడించకముందే సౌత్ గ్రూప్‌నకు పాలసీ డ్రాఫ్ట్ లీకయిందని ఈడీ ఆరోపిస్తోంది. పాలసీ రూపొందిస్తున్న సమయంలో గెహ్లాట్ తన అధికారిక నివాసాన్ని వాడుకోవడానికి ఆప్ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్ విజయ్‌నాయర్‌కు అనుమతిచ్చారని, ఇంతేగాక గెహ్లాట్ తన మొబైల్ నంబర్లను పదే పదే మార్చారని ఈడీ చెబుతోంది. ఈ నేపథ్యంలో గెహ్లాట్‌ను ఈడీ విచారించడం చర్చనీయాంశమైంది.

# గులాబీ బాస్‌కు వరుస షాక్‌లు

**కాంగ్రెస్‌లో చేరిన మేయర్ విజయలక్ష్మి**
**మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్**
**గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్న అంబర్‌పేట ఎమ్మెల్యే**



హైదరాబాద్,మార్చి30(: గులాబీ బాస్ కేసీఆర్‌కు కాంగ్రెస్ పార్టీ కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. గేట్లు ఓపెన్ చేశామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల తర్వాత.. బీఆర్ఎస్ నేతలు హస్తం పార్టీలోకి క్యూ కడుతున్నారు. గత పదేళ్లుగా కేసీఆర్ వెంట నడిచిన నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీల్లో చేరుతున్నారు. ఇప్పటికే కే కేశవరావు, కడియం శ్రీహరి వంటి వారు బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పగా.. తాజాగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కారు పార్టీని వీడతారంటూ ప్రచారం జరుగుతోంది. ఇలా లోక్ సభ ఎన్నికల వేళ బిఆర్ఎస్ గట్టి షాక్ తగిలింది. జీహెచ్ఎంసీ మేయర్ జి.విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. దీపాదాస్ మున్షీ సమక్షంలో మాఎ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరోవైపు రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, భారాస స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కూడా హస్తం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. త్వరలోనే వీరు పార్టీలో చేరనున్నట్లు సమాచారం. అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరికలు పోరుగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హస్తం కండువా కప్పి ఆమె పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్.. దీపాదాస్ మున్షి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ జాయిన్ అయ్యారు. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, రాజ్యసభ ఎంపీ కె కేశవరావు కూడా రోజు కాంగ్రెస్ లో చేరనున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ను వీడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇక, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా పార్టీకి గుడ్ బై చెప్పనున్నారు. కడియం కూతరు వరంగల్ బీఆర్ఎస్ ఎంపీగా పోటీ చేయలేనని తప్పుకున్న సంగతి తెలిసిందే. ఇకపోతే అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేకపో యింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎక్కువమంది గెలిచారు. దీంతో గ్రేటర్ పరిధిలో ఎమ్మెల్యే లను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా రానున్న లోక్‌సభతో పాటు.. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందచ్చనే అంచనాలో హస్తం పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. కీసరలోని ఓ ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గం నేతలతో కాలేరు వెంకటేశ్ ఆదివారం సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. తన భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నేతలతో కాలేరు వెంకటేష్ టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. గత నాలుగు రోజులు గా కాలేరు వెంకటేష్ పార్ట కార్యక్ర మాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందుబాటులో లేకపోవడంతో ఇవాల్టి కేటీఆర్ అంబర్ పేట పర్యటన వాయిదా వేసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కారు దిగి కాంగ్రెస్‌లోకి వెళ్తారనే ప్రచారం జరుగుతోంది.

# రేవంత్‌పై వసూళ్ల ఆరోపణలు

### బంజారాహిల్స్‌లో కెటిఆర్‌పై క్రిమినల్ కేసు

హైదరాబాద్,మార్చి30(ఆర్ఎన్ఎ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి రూ. 2500 కోట్లు వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై హనుమకొండ పోలీసులకు కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాస్ రావు ఫిర్యాదు చేశారు. అయితే హనుమకొండ పోలీసులు ఆ కేసును బంజారా హిల్స్ స్టేషన్‌కు అక్కడి పోలీసులు బదిలీ చేశారు. కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ 504,505(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన సికింద్రాబాద్ లోక్?సభ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? బీజేపీ ప్రభుత్వమా? అని అర్థం కావడం లేదన్నారు. సామంత రాజులా రేవంత్ ఢిల్లీకి రూ.2500 కోట్లు కప్పం కట్టారని ఆరోపించారు. దీనికోసం ఆయన అందరినీ బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి.



## కేసీఆర్ జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పర్యటన షెడ్యూల్ ఇదే..

హైదరాబాద్ : సాగునీరు అందక పంటలు ఎండిపోయి, అకాల వర్షాలతో దెబ్బతిని అల్లాడుతున్న రైతాంగానికి ధైర్యాన్ని నూరిపోసేందుకు బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. ఆదివారం ఆయన నేరుగా రైతుల వద్దకు వెళ్లి, మీకు మేము అండగా ఉంటామన్న భరోసా కల్పించనున్నారు. రేపు సూర్యాపేట, నల్లగొండ, జనగామ జిల్లాల్లోని పలు మండలాల్లో కేసీఆర్ పర్యటించి, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు కేసీఆర్ ఎర్రవెల్లి నుంచి జిల్లాల పర్యటనకు రోడ్డు మార్గంలో బయల్దేరుతారు. జనగామ జిల్లాలోని ధరావత్ తండాకు ఉదయం 10:30 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. 11:30 గంటలకు సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి మండలం, అర్వపల్లి మండలం, సూర్యాపేట రూరల్ మండలాల్లో పర్యటించి, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సూర్యాపేట రూరల్ మండలం నుంచి బయల్దేరి.. 1:30 గంటల వరకు సూర్యాపేట నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు చేరుకుంటారు.



# కాంగ్రెస్‌కు మరో రెండు 'ఐటీ' నోటీసులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీని ఆదాయపన్ను శాఖ(ఐటీ) వెంటాడుతోంది. శుక్రవారమే(మార్చ్ 29)రూ.1800 కోట్ల మేర ఆదాయపన్ను రికవరీ నోటీసులు అందుకున్న కాంగ్రెస్ పార్టీకి తాజాగా మరో రెండు నోటీసులను ఐటీ శాఖ పంపిందని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ చెప్పారు. ఈ నోటీసులు శనివారం రాత్రి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ట్యాక్స్ టెర్రరిజానికి కాంగ్రెస్ టార్గెట్‌గా మారిందని జైరామ్ ఫైర్ అయ్యారు. కాగా, 2017-18 నుంచి 2020-21 ఆదాయపన్ను అసెస్‌మెంట్ సంవత్సరాలకుగాను పెనాల్టీ, వడ్డీని కలిపి రూ.1800 కోట్ల పన్ను కట్టాలని శుక్రవారం ఇచ్చిన నోటీసులో ఐటీ శాఖ పేర్కొంది. నాలుగేళ్ల రిటర్న్‌పై రీఅసెస్‌మెంట్ ప్రొసిడింగ్స్ ప్రారంభించాలన్న ఆదాయ పన్ను శాఖ ఆదేశాలను కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఐటీ రికవరీ నోటీసులు పంపింది. 2014-15, 2015-16,2016-17 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఆదాయ పన్ను రిటర్నులను కూడా రీ అసెస్‌మెంట్ చేసే చర్యలు ఐటీ ఇప్పటికే ప్రారంభించింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ. 135 కోట్ల మేర నగదును ఫ్రీజ్ చేసింది.



# సంపాదకీయం

ఆదివారం 31-03-2024

## ఉచితానుచితాలపై చర్చ

దేశంలో ఉచితాల అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలపై కొంతకాలంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఉచిత పథకాలపై ఇచ్చే హామీలను నియంత్రించాలంటూ కొంతమంది న్యాయస్థానాల గడప కూడా తొక్కారు. ఆర్థికశాస్త్రంలో సంపద సృష్టి, సంపద పంపిణీ మధ్య నిరంతర చర్చ జరుగుతూనే ఉంది. ఇరవయ్యవ శతాబ్దం తొలిరోజుల్లో ప్రపంచవ్యాప్తంగా వలస పాలన వ్యతిరేక స్వాతంత్ర్య ఉద్యమాలు పెల్లుబికి ముందుకు వచ్చాయి. ఈ ఉద్యమాలు అన్ని దేశాల్లోనూ సంక్షేమ రాజ్యం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ప్రజల మద్దతు సమీకరించాయి. ఏ దేశ స్వాతంత్ర్య ఉద్యమం కూడా తాము పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మిస్తాం అని కనీసం మాట వరసకు కూడా అనలేదు. ఇక్కడో విషయం ప్రస్తావించుకుని తీరాలి. 1971?72 ప్రాంతంలో పేదరిక నిర్మూలన గురించి విస్తృతంగా ప్రచారం జరుగుతున్న సమయంలో ఇందిరా గాంధీ ఓ రోజు ఛాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సదస్సులో పాల్గొన్నారు. అప్పుడు సంపద పెరగకుండా సంక్షేమాన్ని ఎలా సాధిస్తారని ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన ఓ ప్రముఖుడు ఇందిరా గాంధీని ప్రశ్నించారు. దీనికి ఇందిర జవాబు చెబుతూ ఉచితాలను బలపరిచారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కొన్ని దశాబ్దాల పాటు తమ జీవితాలు మారతాయని ప్రజలు ఆశించారని ఆమె చెప్పారు. అయితే అనేకానేక కారణాలతో ప్రజల బతుకుల్లో వెలుగులు రాలేదన్న వాస్తవాన్ని ఇందిర అంగీకరించారు. ఈ నేపథ్యంలో పేదల బతుకులు బాగు చేయడం కోసం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదన్నారు. ఉన్న సంపదలోనే పేదలకు కొంత వాటా ఇవ్వడం తప్పనిసరి అంటూ ఉచితాలను ఇందిరా గాంధీ అప్పట్లోనే బలపరిచారు.ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచితాలను తాయిలాల సంస్కృతిగా వ్యతిరేకులు పేర్కొంటున్నారు. తాయిలాల సంస్కృతి దీర్ఘకాలంలో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్న విమర్శలు వస్తున్నాయి. సంక్షేమం పేరుతో అడ్డూ అదుపు లేకుండా ఉచిత పథకాలు అమలు చేయడం దేశ ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం మంచిది కాదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఉచితాలతో రాష్ట్రాలు అప్పుల కుప్పలుగా మారుతున్నాయంటున్నారు కొందరు ఆర్థిక వేత్తలు.ప్రజల నుంచి వివిధ రకాల పన్నుల రూపంలో ప్రజల నుంచి సేకరించిన సొమ్ములను రాజకీయ ప్రయోజనాల కోసం, ఓట్ల కోసం పందారం చేయడం ఎంతవరకు సమంజసమని వీరు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి మన దేశంలో ఉచిత పథకాలు ఇప్పటికిప్పుడు వచ్చినవి కావు. కొన్ని దశాబ్దాల నుంచి ఉచిత పథకాలు అమలవుతున్నాయి. ఉచిత పథకాలు అనగానే వెంటనే గుర్తుకువచ్చేది తమిళనాడు రాష్ట్రం. తమిళనాడు ఉచిత పథకాలకు పెట్టింది పేరు. తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్‌ను ఉచితాలకు ఆద్యుడిగా చెప్పవచ్చు. ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాతే ఉచితాలు ఎక్కువయ్యాయి. అయితే ఆయన ఉచితాలు ప్రారంభించడం వెనుక ఎటువంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. 70ల్లో తమిళనాట పేదరికం బాగా ఉండేది. మూడు పూటలా తిండి సంపాదించుకోవడానికే పేదలు నానా ఇబ్బందులు పడేవారు. చిన్నారులను బడులు మానిపించి సంపాదన కోసం కార్ఖానాలకు పంపేవారు. ఈ స్థితిని చూసి ఆయన పేదలను ఆదుకోవాలనుకున్నారు. ఈ నేపథ్యంలోనే పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజనం అనే వినూత్న పథకాన్నిప్రారంభించారు.దాదాపుగా అన్ని పార్టీలు ఉచిత మంత్రం జపిస్తున్నాయి. అయితే దీనిపై,పన్నుల రూపాల్లో ప్రజలు కట్టిన సొమ్మును ఉచితాల పేరుతో పంచి పెడుతున్నారన్న వాదన వ్యతిరేక వర్గం నుంచి వినిపిస్తోంది. మరోవైపు ఉచితాలు కొనసాగించాల్సిందేనన్న వాదన కూడా బలంగా వినిపిస్తోంది.ప్రభుత్వానికి సంపద సృష్టించడం ముఖ్యమే కావచ్చు. దీనికోసం రకరకాల మార్గాలున్నాయి.కానీ పేద వర్గాలకు బతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యం కావాలి. అందుకే ఉన్న సంపదలో పేదవర్గాలకు కాస్తంత వాటా ఇవ్వాల్సిందేనంటున్నారు జనం పక్షాన నిలబడే ఆర్థిక వేత్తలు. పరిమితికి మించకుండా కొంతమేర ఉచితాలు ఇవ్వడంలో ఎలాంటి తప్పులేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఏది ఏమైనా కాలే కడుపునకు పట్టెడన్నం పెట్టడమే ప్రభుత్వాల విధి కావాలి. సంక్షేమం పేరుతో కొంతవరకు ఉచితాలను ప్రకటించినా, వాటిని స్వాగతించాల్సిందే. సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యం కావాలి. ప్రభుత్వ రంగ బ్యాంకులకు లక్షల కోట్ల రూపాయల రుణాన్ని ఎగవేసి ఎంచక్కా విదేశాల్లో విలాసవంతమైన జీవితాలను అనుభవిస్తున్న కార్పొరేట్ దిగ్గజాల గురించి పల్లెత్తు మాట అనని ఆర్థికవేత్తలు పేదవారి కోసం అమలు చేస్తున్న ఉచితాలకు వ్యతిరేకంగా మాట్లాడటం విడ్డూరం. ఏమైనా సమాజంలోని మెజారిటీ ప్రజలు కోరుకునేది సంక్షేమ రాజ్యమే.

# అఖండ హరినామ శోభాయాత్ర ...

## నేడు సప్త సమాప్తి....



















తానుర్,మార్చి 30(లోకంతీరు):గ్రామమంత హరినామ స్మరణతో మారుమోగింది.చిన్న పెద్ద తేడా లేకుండా భక్తీ శ్రద్ధలతో బోసి గ్రామం పులకించి పోయింది.శనివారం నిర్మల్ జిల్లా తానుర్ మండలం లోని భోసి గ్రామంలో హరిణామా కీర్తనలను ఘనంగా నిర్వహించారు.నేడు మహాసప్త సమాప్తి సందర్భంగా బోసి గ్రామంలో గత ఏడు రోజులుగా జరుగుతున్న అఖండ హరినామ సప్త ఆదివారంతో ముగియనున్నది. ఈ ఇందులో భాగంగా శనివారం సాయంత్రం గ్రామస్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గావు ప్రదక్షిణ ,పాదపూజ, వీణ పూజ, తులసి పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు భగవత్గీత మహా గ్రంథానికి ఏడూ రోజులు పారాయణం చేస్తూ నేటితో ముగింపు సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా విట్టల్ రుక్మిణి బాయి విగ్రహ ప్రతిష్ఠ నుండి ఈ అఖండా హరినామ సప్త నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అఖండ హరినామ సప్త ఘనంగా నిర్వహించామని నేటితో ఆ సప్త సామాప్తి అవుతుందని అన్నారు.అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్క గ్రామ ప్రజలు కూడా పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించాలని గ్రామ పెద్దలు కోరారు. ఈ హరినామ సప్త సందర్భంగా ప్రతి రోజు హరిపాట్ నిర్వహించమన్నారు. గ్రామస్తులకు గ్రామానికి ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, అదేవిధంగా పాడి పంటలతో సుఖ సంతోషాలతో గ్రామ ప్రజలందరూ ఉండాలని గ్రామ పెద్దలు కోరారు. నేడు జరిగే మహా అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజలతోపాటు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ శోభాయాత్రలో భజన మండలి , మహిళా భజన మండలి,మహిళలు,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.







## సజ్జ పంటలో కత్తెర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



బాల్కొండ మార్చ్ 30 ( లోకం తీరు )బాల్కొండ మండలంలో కత్తెర పురుగు సోకిన సజ్జ పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు మరియు శాస్త్రవేత్తలు పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్త విజయ్ మాట్లాడుతూ 1. ప్రస్తుతము సజ్జ పంటలో కత్తెర పురుగు యొక్క ఉధృతి అధికంగా ఉన్నట్లు గమనించడం జరిగినది వేడి వాతావరణం లో కత్తెర పురుగు జీవిత చక్రం తొందరగా ముగించుకొని పంటను విచ్చలవిడిగా ఆశించి తీవ్రంగా నష్టపరుస్తుందని తెలిపారు. కావున సజ్జలో ప్రస్తుతం సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. 2. విత్తనము విత్తుకునే ముందు విత్తన శుద్ధి సయాలోత్రీన్ ప్లస్ తయోమితాక్షమ్ 0.6 మిల్లీలీటర్ కిలో విత్తనానికి చేసుకోవాలి. 3. అలాగే ఎకరానికి 8 నుండి 10 లింగాకర్షక బుట్టలను పంటకు ఒక ఫీట్ ఎత్తున అమర్చుకోవాలి. 4. బాగా ఎదిగిన లార్వాలు పంటలో గమనించినట్లయితే విషపు ఎర ఉండలుగా చేసుకొని సాయంత్రం వేళల్లో మొక్క సుడులలో వేసుకోవాలి విషపు ఎర తయారు చేసుకోవడానికి 10 కిలోల తౌడు, 2 కిలోల బెల్లం మరియు తయోమితాక్సమ్ లేదా క్లోరోపైరీఫాస్ ఉపయోగించుకోవాలి. 5. రసాయనక నివారణ చర్యల్లో భాగంగా క్లోరానిత్రనీలిప్రోల్ 0.4ఎత్రీ లేదా స్పైనాతోరం 0.5ఎత్రీ లేదా థయోమెతక్సిమ్ + లాండా సాహలోత్రిన్ 0.25 ఎత్రీ లీటరు నీటికి ఏదేని ఒకదానిని రెండు వందల లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలి. భీంగల్ వ్యవసాయ ఐఅం మల్లయ్య గారు, మండల వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## చత్రపతి శివాజీ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో చలి వేంద్రం ప్రారంభం




కోటగిరి/బాన్సువాడ మార్చ్ 30 లోకం తీరు:-కోటగిరి మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం వద్ద చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం గ్రామ పెద్దలు ఉమాకాంత్ దేశముఖ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ. బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన చత్ర పతి శివాజీ యూత్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. యువకులు చత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా వారు కొనియాడారు. పార్టీలకు అతీతంగా యువకులు ఇలాంటి కార్యక్రమాల కు ముందుకు రావడం హర్షనియ మని రాబోయే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలకు చేయూతనందిస్తా మని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. తొలి రోజు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బిమసాయిరెడ్డి,తెల్ల రవికుమార్,బిజెపి మండల అధ్యక్షులు ఏముల నవీన్,బర్ల మధు,కప్ప సంతోష్,పి.అనిల్, దౌలయ్య, చత్రపతి శివాజీ యూత్ నిర్వాహకులు బాన్సువాడ హనుమాన్లు,గాండ్ల గోపి,ఎక్కర్ల వీరేశం,యోగేశ్వర్,అరుణ్ గౌడ్,పెద్ద కాపు శ్రీకాంత్,శ్యామల కులకర్ణి,గాండ్ల మధు,వినోద్ పటేల్,నీలి శివ,యువకులు, పాల్గొన్నారు.

## టెలిగ్రాఫ్ యాక్టుకు అటాచ్డ్...

హైదరాబాద్, మార్చి 30, (న్యూస్ పల్స్)రోజుకో ట్విస్ట్‌తో తెలంగాణలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఫోన్ ట్యాపింగ్‌పై ఎట్టకేలకు అధికారికంగా కేసు నమోదయ్యింది. టెలిగ్రాఫ్ యాక్ట్‌కు అటాచ్ చేస్తూ నాంపల్లి కోర్టులో మెమో దాఖలు చేశారు. దీంతో దేశంలోనే తొలిసారిగా టెలిగ్రాఫ్ యాక్ట్ కింద కేసు నమోదవ్వడం హాట్ టాపిక్‌గా మారింది. కొత్త కొత్త కోణాలు, పెను సంచలనాలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. దొరికిన ఏ ఒక్క ఆధారాన్ని వదలిపెట్టకుండా విచారణ కొనసాగిస్తున్నారు అధికారులు. అయితే లేటెస్ట్‌గా ఫోన్ ట్యాపింగ్‌పై అధికారికంగా కేసు నమోదవ్వడం.. దేశంలోనే టెలిగ్రాఫ్ యాక్ట్‌కు అటాచ్ చేసిన తొలి కేసు ఇదే అవ్వడంతో ట్యాపింగ్ వ్యవహారం మరింత సీరియస్ టర్న్ తీసుకుంది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం రియాక్ట్ అయ్యారు. నిందితులకు జైలులో చిప్ప కూడు తప్పదన్నారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. ఇక కేసు దర్యాప్తులో ప్రణీత్‌రావుతో పాటు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌ను జడ్జి ముందు హాజరుపరిచారు పోలీసులు. గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షల తర్వాత న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. అయితే రాధాకిషన్‌కు 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. అంతకు ముందు రాధాకిషన్‌ను అదుపులోకి తీసుకున్న వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ ప్రశ్నల వర్షం కురిపించారు. కీలక విషయాలను రాబట్టి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. ప్రణీత్‌రావుతో ఉన్న సంబంధాలు? ఎంతకాలంగా ఫోన్ ట్యాపింగ్ చేశారు? ఏయే ప్రాంతాల్లో ట్యాపింగ్‌కి పాల్పడ్డారు? ట్యాపింగ్ సమాచారాన్ని ఎవరికి పంపించారనే కోణంలో విచారించారు. ఇక మొత్తంగా ట్యాపింగ్ కేసులో రేపో ఎల్లుండో కీలక వ్యక్తులు బయటకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఎన్నికల హామీలను త్వరగా నెరవేర్చాలి

**- గత ప్రభుత్వం వలె అంకెల గారడీలు చేయొద్దు**

**- ఎంసిపిఐయు రాష్ట్ర కమిటీ సభ్యులు మలావత్ జబ్బర్ నాయక్**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 30 లోకంతీరుకామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జబ్బార్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేసి ప్రజల ఆశలను నెరవేర్చాలని అందుకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలని, గత ప్రభుత్వం వలె అంకెల గారడీలు చేయవద్దని అన్నారు. శనివారం రాష్ట్ర అసెంబ్లీలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 2, 75, 891 కోట్ల రూపాయల ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదనపై కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేసే విధంగా బడ్జెట్ కేటాయించినందుకు సంతోషమే అయినా, ఇప్పటికి ఆచరణ త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే కుంటి సాకులతో లబ్ధిదారులను అనర్హులుగా చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఇచ్చినట్లుగా అమలు చేయాలన్నారు. రాష్ట్రానికి తలమానికమైన వ్యవసాయ రంగానికి 19 వేల కోట్ల రూపాయలే కాకుండా కనీసం 20 శాతం నిధులను కేటాయించాల్సిందన్నారు. అభివృద్ధిలో వెనుకబడిన దళిత, గిరిజన, బీసీ, మైనారిటీలను ముందుకు నడిపించేందుకు ఎలాంటి చర్యలు ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే నిరుద్యోగులకు భృతి కల్పించేందుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం రైతుల పంటల ధరల నియంత్రణ కోసం బడ్జెట్ కేటాయించకపోవడం సరైనది కాదన్నారు. ఏది ఏమైనా బడ్జెట్ ఆచరణలో అమలు అయ్యే విధంగా పేదలకు న్యాయం జరిగే విధంగా ఆశలు నెరవేరే విధంగా ప్రకటించిన హామీలను తక్షణమే అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మహిపాల్, సుజాత, సదానందం, ఫయాజ్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# పురుగు సోకిన సజ్జ పంటని సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలి:భీంగల్ ఏ డి ఏ మల్లయ్య



బాల్కొండ నియోజకవర్గ ప్రతినిధి , మార్చి 30 ( లోకం తీరు): నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామం లో కత్తెర పురుగు, మొగి పురుగు సోకిన సజ్జ పంటలని భీంగల్ ఏ. డి.ఏ. మల్లయ్య మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ తో కలిసి పరిశీలించడం జరిగింది.. ప్రస్తుతం సజ్జ లో పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున నివారించుకోడానికి రైతులు సమగ్ర సస్య రక్షణ చర్యలను పాటించాలి అని సూచించారు.కత్తెర పురుగు జీవిత చక్రాన్ని వేగంగా (30-35 రోజుల్లో) పూర్తి చేసుకోవడమే కాకుండా అధిక సంఖ్యలో 1500-2000 గ్రుడ్లు పెట్టడం వలన పంటపైన నష్టం అధికం గా జరుగుతుంది. అందుకే పురుగు నివారణకు సరియినా సమయం లో సరిఅయిన మందులు వాడాలి.ముఖ్యంగా పురుగు ఉధృతి గమనించంగానే.. తొలి దశలో వేప నూనె 5యంల్ /లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.-గ్రుడ్డు నుండి బయటికి రాగానే నివారణ చర్యలు చేపట్టడం ఆలస్యం అయినచో పురుగులు మొగిలోకి చొచ్చుకొని పోయి అభివృద్ధి చెందుతున్న ఆకులని తింటూ పెరిగి.. క్రమేణా పూర్తిగా మొగి సుడిలోపల ఉండిపోయి నష్టం చేకూరుస్తాయి.× ఈ పురుగు సాయంత్రం మధ్యాహ్నం సమయం లో ఆచేతనం గా మొగి లోపల ఉండి సాయంత్రం వేళల్లో నష్టం చేకూరుస్తుంది కావున తప్పకుండా సాయంత్రం పిచికారీ చేసుకోవాలి.× పిచికారీ చేసే సమయంలో మొక్క పై పాటుగా కాకుండా మొక్క మొగి తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలి.-తొలి రెండు దశ లార్వ నివారణకు ఏమమేక్టిన్ బెంజోయేట్ 0.80 గ్రామ్ /ఎకరానికి లేదా నోవుల్యూరోన్ 400యంల్ /ఎకరానికి లేదా క్లోరాంట్రోనిలిప్రోలే 60యంల్ /ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. మలి దశ పురుగు నివారణకి స్పీనేతోరం 200యంల్ /ఎకరానికి లేదా తీమెథక్సమ్+లాంబ్డ సైహలొత్రిన్ అనే మందు ఎకరానికి 80యంల్ చొప్పున పిచికారీ చేసుకోవాలి.అలాగే రెక్కల పురుగులని నిర్మూలించడానికి ఎకరానికి 10 లింగాకర్షక బుట్టలు ఏర్పారుచుకోవాలి.అలాగే పురుగు యొక్క కోశాస్త దశ నేలలో ఉండి పంట లభ్యం అవగానే బైటకి వచ్చి నష్టం చేకూరుస్తుంది.. కావున పంట కోసిన తరువాత లో దుక్కులు చేపట్టినట్టు అయితే పురుగు ఉధృతి తగ్గించవచ్చు.కార్యక్రమంలో అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్ నిషికాంత్, రైతులు పాల్గొన్నారు.

# పాశ్చాత్య వైద్యంలో పట్టాపొందిన మొట్టమొదటి భారతీయ మహిళా వైద్యురాలు ఆనందీబాయి జోషి.

## -నేడు వారి జయంతి

పాశ్చాత్య వైద్యంలో పట్టాపొందిన మొట్టమొదటి భారతీయ మహిళా వైద్యురాలు ఆనందీ గోపాల్ జోషి లేదా ఆనందీబాయి జోషి. (కాదంబిని గంగూలీ కూడా అదే సంవత్సరం అనగా 1886 లో ఆనందీబాయి తర్వాత పట్టాపొందారు.) ఈ గుర్తింపు పొందిన మొదటి హిందూ మహిళ కూడా ఈమే. అమెరికాలో అడుగుపెట్టిన తొలి హిందూ మహిళ కూడా ఈమేనని భావించబడుతున్నది. ఈమె జన్మదినాన్ని పురస్కరించుకొని 2018 లో గూగుల్ తన




డూడుల్ ని పెట్టింది .ఆనందీబాయి పూణే (మహారాష్ట్ర) లోని సనాతన సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో మార్చ్ 31, 1865 లోజన్మించారు. ఈమెకు తల్లితండ్రులు యమున అని పేరు పెట్టారు. 9 సంవత్సరాల వయసులో దాదాపు ఇరవై సంవత్సరాలు పెద్దయిన గోపాల్ రావు జోషిని వివాహం చేసుకుంది. వివాహం తరువాత, ఆమె భర్త ఆమెకు ఆనందీబాయి అని పేరు పెట్టాడు.

" సెరంపోర్ కాలేజ్" హాలులో ఆనందీబాయి ఉపన్యసించిన సమయంలో తాను వైద్యవిద్యను అభ్యసించడానికి అమెరికా ఎందుకు వెళ్ళాలనుకుంటుందో వెల్లడించింది. అనందీబాయి ఆమెభర్త అనుభవించిన హింస గురించి తన ఉపన్యాసంలో వివరించింది. భారతదేశంలో హిందూ మహిళావైద్యురాళ్ల అవసరం గురించి వివరించింది. అలాగే ఆమె భారతదేశంలో మహిళా వైద్య కళాశాల ప్రారంభించడం తన లక్ష్యమని వివరించింది. అయితే తాను క్రైస్తవమతాన్ని స్వీకరించనని మాత్రం వత్తిపలికింది. ఆమె ఉపన్యాసం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. భారతదేశం నలుమూలల నుండి ఆర్థికసహాయం చేస్తామని సందేశాలు అందుకున్నది. ఆమె విద్యకు సహాయంగా అప్పటి భారత వైస్రాయి కూడా 200 రుపాయల ఆర్థికసాయం పంపాడు. భర్తకు అమెరికాలో ఉద్యోగం లభించని కారణంగా అనందీబాయి మాత్రం ఒంటరిగా ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికా వెళ్ళింది. విపరీతమైన వ్యతిరేకతల నడుమ ఆమె 1883 జూన్ మాసంలో వైద్యవిద్యాభ్యాసానికి అమెరికాలో కాలు పెట్టింది

ఆమె తీవ్ర ఆరోగ్యసమస్యలతో మూడు సంవత్సరాల ఉన్నతవిద్యాభ్యాసం పూర్తిచేసి ఫైనల్ ఎగ్జాంస్ వ్రాసింది. 1886 మార్చి 11 న ఆమె వైద్య విద్యలో డాక్టరేట్ సాధించింది.

భారతదేశానికి తిరుగుప్రయాణం చేసే సమయంలో ఆనందీబాయి ఆరోగ్యం మరింత దిగజారింది. నౌకాలో ప్రయాణం చేసే సమయంలో ఆమెకు చికిత్స చేయడానికి వైద్యులు నిరాకరించారు. వైద్యులు చికిత్సచేడానికి నిరాకరించడానికి కారణం ఆమె " బ్రౌన్ వుమన్ " (సాధారణంగా భారతీయులను బ్రౌన్ ప్రజలు అంటారు ) కావడమే. 1886 చివరిభాగంలో, ఆనందిబాయి భారతదేశానికి తిరిగివచ్చారు. దేశం ఆమెకు ఘనంగా స్వాగతం పలికింది. ఆమెను కొల్హాపూర్ సంస్థానానికి చెందిన వైద్యురాలిగా నియమించింది. అల్బర్ట్ ఎడ్వర్డ్ వైద్యశాలలోని మహిళా వార్డుకు అధికారిణిగా బాధ్యతలను అప్పగించింది కలకత్తా చేరిన తరువాత ఆనందీభాయి బలహీనత, నిరంతర తలనొప్పి, తరచూ జ్వరం, ఆయాసాలతో బాధపడింది. థియోడిసియా ఆమెకు అమెరికా నుండి ఔషధాలను పంపింది. తరువాత ఆమె ఆయుర్వేద చికిత్స కొరకు కజిన్ ఇంట్లో బసచేసింది. ఆయుర్వేద వైద్యనిపుణుడు ఆమె నౌకాయానం చేసి విదేశాలకు వెళ్ళి సంప్రదాయ సరిహద్దులు దాటినందుకు ఆమెకు చికిత్సచేయడానికి నిరాకరించాడు. భారతదేశానికి తిరిగివచ్చిన ఒక్క సంవత్సరంలోపుగానే ఆమె ఫిబ్రవరి 26, 1887 తేదీన 22 సంవత్సరాల చిరుతప్రాయంలో అకాలమరణం చెందారు.

# మండి ప్రజల గొంతునవుతా.. కంగనా రనౌత్

సిమ్లా: ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం ఓ వైపు అధికార పక్షం, మరో వైపు ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ప్రచారం సాగిస్తున్నాయి.ఇటీవల బీజేపీ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి సీటు దక్కించుకున్న బాలీవుడ్ నటి, బీజేపీ అభ్యర్థి 'కంగనా రనౌత్' ప్రచారం మొదలు పెట్టారు.హిమాచల్ ప్రదేశ్‌లోని మండిలో ప్రచారం ప్రారంభించిన కంగనా.. అధికారంలోకి వస్తే నియోజకవర్గ ప్రజలకు పూర్తి సమయం సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. బీజేపీ అభ్యర్థిగా పార్లమెంటులో 'మండి ప్రజల గొంతు' అవుతానని పేర్కొన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు మరియు రోడ్ల కోసం పని చేస్తానని, ప్రజల హక్కుల కోసం పోరాడతానని.. మండి కోసం నేను గొంతు పెంచుతానాని అన్నారు.స్వామి వివేకానంద, సద్గురు జీ, ప్రధాని నరేంద్ర మోదీ తనకు స్ఫూర్తి అని కంగనా అన్నారు. ఇది నా జన్మభూమి.. నన్ను తిరిగి పిలిచింది. నన్ను ప్రజలు ఎన్నుకుంటే సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు.భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కంగనను లోక్‌సభ ఎన్నికల్లో మండి స్థానం నుంచి పోటీ చేయడానికి ఐదవ జాబితాలో అభ్యర్థిగా ప్రకటించింది. ఒకరికొకరు సహకరించుకోవడం బీజేపీ సంస్కృతి. అదే నమ్మకంతో వారితో కలిసి నడుస్తాం, గెలుస్తాం.. పెద్ద ఎత్తున ప్రచారం చేస్తాం' అని ఆమె పేర్కొన్నారు. నేను బీజేపీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.




## 20 మంది పేద ముస్లిం కుటుంబాలకు చేయూత

**రంజాన్ తొఫా పంపిణీ చేసిన మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు ఎం.ఏ.హకీం**



కోటగిరి/బాన్సువాడ మార్చ్ 30 లోకం తీరు:-రంజాన్ పండగను పురస్కరించుకొని శనివారం పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగాల్ కు చెందిన 20 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఉమ్మడి కోటగిరి మండల మాజీ కోఆప్షన్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.ఏ హకీమ్ ఆధ్వర్యంలో రంజాన్ పండగకు సంబంధించిన నిత్యవసర సరుకులు(రంజాన్ తోఫా) అందజేశారు. ఈ సందర్భంగా పోతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల శంకర్ మాట్లాడుతూ. జన్మనిచ్చిన గ్రామానికే కాకుండా చుట్టుప్రక్కల ఉన్న గ్రామాలలో కూడా ఎం.ఏ.హ కీం చేస్తున్న పలు సేవా కార్యక్రమా లు అభినందనీయమని అన్నారు. ఈ రంజాన్ పండగ సందర్భంగా పాత పోతంగల్ కు చెందిన 20 మంది మైనార్టీ కుటుంబాలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేయడంలో మమ్మల్ని భాగస్వా మ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మునుముందు ఎం.ఏ.హకీం మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎం.ఏ.హకీం మాట్లా డుతూ.కోటగిరి,పోతంగల్ మండలాలలో పలువురికి ఉప యుక్తమైన పలు సేవా కార్యక్రమా లకు తాను ముందు వరసలో ఉంటానన్నారు. తాను చేసే ప్రతి కార్యంలో ప్రతి ఒక్కరి సహకారం ఉండాలని ఆయన కోరారు. ఈ తొఫా పంపిణీలో మాజీ ఎంపీపీ గంధపు పవన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా.సజ్జద్, మండల మైనార్టీ సేల్ అధ్యక్షులు వాజిద్,నాయకులు గంధపు దత్తు, బాబా,దేవ్ సింగ్,మైనారిటీలు పాల్గొన్నారు.

## 55 లక్షల కోట్ల నుంచి 205 లక్షల కోట్లకు అప్పును పెంచేశారు: ప్రియాంకా గాంధీ



న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు 14 లక్షల కోట్ల రుణం తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందని, ఆ ప్రతిపాదనలను కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వద్రా తప్పుపట్టారు. దేశ ప్రజలను ఎందుకు అప్పుల ఊబిలోకి నెట్టివేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం పెరుగుతున్నట్లు ఆమె చెప్పారు. ఆర్థిక లోటును పూడ్చేందుకు సెక్యూర్టీలను జారీ చేసి రాబోయే ఆర్థిక సంవత్సరానికి సుమారు 14.13 లక్షల కోట్ల రుణం తీసుకోనున్నట్లు ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆ విషయాన్ని ప్రియాంకా గాంధీ తన ఎక్స్ అకౌంట్‌లో ప్రశ్నించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 14 లక్షల కోట్లు అప్పు తీసుకోవాలని ఆర్థిక శాఖ ప్రతిపాదించిందని, ఎందు కోసం ఆ డబ్బు అని ప్రియాంకా ప్రశ్నించారు.స్వంతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకు దేశం చేసిన అప్పు 55 లక్షల కోట్లు మాత్రమే అని, కానీ గడిచిన పదేళ్లలో మోదీ సర్కారు ఆ రుణాన్ని 205 లక్షల కోట్లకు చేర్చినట్లు ప్రియాంకా ఆరోపించారు. అంటే మోదీ సర్కారు గత పదేళ్లలో సుమారు 150 లక్షల కోట్ల అప్పు చేసినట్లు తెలిపారు. దేశంలోని ప్రతి పౌరుడిపై 1.5 లక్షల అప్పు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

## ఎవరు ఎటు వెళ్లిన బీఆర్ఎస్‌కి నష్టం లేదు : మాజీ స్పీకర్ పోచారం



హైదరాబాద్ : ఎవరు వెళ్లిన బీఆర్ఎస్ నష్టం లేదని.. పార్టీలో ప్రస్తుతం గట్టి కార్యకర్తలు మాత్రమే మిగిలారని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ మంజుశ్రీ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి ప్రజలు భ్రమతో ఓట్లు వేశారన్నారు. హామీల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులుపడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, చేస్తున్న మోసాలను ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు.

# సినిమా తీరు

## పింక్ బ్యూటీలో శ్రీలీల పరిమళం!



శ్రీలీల నెట్టింట క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు ఎలాంటి ఫోటో పోస్ట్ చేసినా క్షణాల్లో వైరల్ అవుతుంది. యంగ్ హీరోల నుంచి స్టార్ హీరోలకు ప్రమోట్ అవ్వడంతో సొగసరి క్రేజ్ రెట్టింపు అయింది. అమ్మడు హాట్ అప్పీరియన్స్ కి తొలి నుంచి దూరవే. సెగలు పుట్టించే భంగిమలు..ఫోటోలకు మాత్రం దూరంగా ఉంటుంది. అలాగని స్కిన్ షోకి దూరంకాదు. ఓ మోతాదు డోస్ లో అలరిస్తుంటుంది. వీలైనంత వరకూ డిజైనర్ దుస్తుల్లో కటౌట్ కి తగ్గ ఎంపికలతోనే హైలైట్ అవుతుంది. సౌత్‌లో సెటిలైన బాలీవుడ్ స్టార్లు తాజాగా సొసగరి మరో కొత్త ఫోటోతో నెట్టింట్లోకి వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా పింక్ వర్ణం దుస్తుల్లో వావ్ అనిపించే లుక్ తో ఆకట్టుకుంటుంది. సొగసరి స్కిన్ టోన్ పై ఈ వర్ణం ఎంతో అందంగా కనిపిస్తుంది. స్కిన్ సైతం రోజ్ బ్యూటీ తలపించేలా మ్యాకప్ అయింది. హెయిర్ కి గోల్డ్ కలర్ టచప్ ఇచ్చింది. చెవులకు ధరించిన రింగులు..అమ్మడి మ్యాకప్ ప్రతీది శ్రీలీలని మరింత అందంగా ఆవిష్కరించాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ఇక ఆ బ్యూటీని ఆకాశానికి ఎత్తకుండా ఆపేది ఎవరు? అమ్మడి అభిమానులంతా తమదైన శైలిలో కామెంట్లు గుప్పిస్తున్నారు. లుక్స్ గార్జియస్.. బ్యూటీఫుల్ ..లవ్ యూ బంగారం అంటూ పొగిడేస్తూ ప్రపోజ్ చేస్తున్నారు. ఇక శ్రీలీల కెరీర్ సంగతి చూస్తే ఇటీవలే 'గుంటూరు కారం'తో హిట్ అందుకుంది. కానీ ఆ హీట్ ఎక్కడా కనిపించలేదు. అమ్మడికి కొత్త అవకాశాలు అంటూ ఇక్కడేమి రాలేదు. దీంతో కోలీవుడ్ లో లాంచ్ అయ్యే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇటీవలే ఓ కాలేజ్ ఈవెంట్లో అక్కడ సినిమాల్లో నటించాలని ఉందని ఓపెన్ అయింది. దీంతో టాలీవుడ్ లో ఖాళీగా ఉండటంతోనే అక్కడ సినిమాలపై దృష్టి పెడుతుందని ఓ అంచనాకి వచ్చేసారు. మరీ సన్నజాజి సోయగానికి అక్కడ ఎలాంటి అవకాశాలు వస్తాయో చూడాలి. చబ్బీ భామలకిచ్చిన ప్రాముఖ్యత నాజూగు భామలకు లేదనే విమర్శ అక్కడ ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటుంది.

## బిజీ బిజీగా విశ్వక్.. వ్వాటే లైనప్!

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో విశ్వక్ సేన్.. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. వరుసగా షూటింగ్స్ లో పాల్గొంటున్నారు. ఒక్కొక్క సినిమాను పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. ఆరేళ్ల పాటు షూటింగ్ జరిగిన గామి మూవీతో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న అఘోర శంకర్ పాత్రలో నటించి మంచి హిట్ ను అందుకున్నారు. ఎ ఇక త్వరలో గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాతో సందడి చేయనున్నారు మాస్ కా దాస్. విశ్వక్ నటించిన ఈ పొలిటికల్ విలేజ్ డ్రామా.. సమ్మర్ కానుకగా మే17వ తేదీన థియేటర్లలో రిలీజ్ కానుంది. హీరోయిన్ గా డీజే టిల్లు ఫేమ్ నేహా శెట్టి, లీడ్ రోల్ లో అంజలి నటిస్తున్న ఈ మూవీపై మంచి అంచనాలే ఉన్నాయి. దీంతోపాటు విశ్వక్ సేన్ అనేక నిర్మాణ సంస్థలతో పని చేస్తున్నారు. అందుకు సంబంధించిన క్రేజీ అప్డేట్స్ నిన్న వచ్చాయి. ఆ వివరాలివే.. రవితేజ ముళ్ళపూడి దర్శకుడిగా ఈ సినిమా ద్వారా టాలీవుడ్ కు పరిచయమవుతున్నారు. ఎస్ ఆర్ టీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ ను రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అందిస్తున్నారు. తెలుగమ్మాయి మీనాక్షీ చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. నిన్న మేకర్స్.. ఫస్ట్ లుక్ ను విడుదల చేశారు. అందులో విశ్వక్ సేన్.. స్టైలిష్ గెడ్డంతో మాస్ లుక్ లో కనిపిస్తున్నారు. లైలా.. ఈ సినిమా కోసం విశ్వక్ సేన్ ఇటీవల భగవంత్ కేసరితో సూపర్ హిట్ కొట్టిన షైన్ స్క్రీన్స్ తో పని చేస్తున్నారు. ఈ మూవీతో మరో కొత్త దర్శకుడు రామ్ నారాయణ్.. ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా మోషన్ పోస్టర్ కలర్ ఫుల్ గా కనిపిస్తోంది. తనిష్క్ బాగ్చి మ్యూజిక్ అందిస్తున్న ఈ మూవీలో విశ్వక్ సేన్.. లేడీ గెటప్ లో కనిపించనున్నారు. వీటితోపాటు విశ్వక్ సేన్.. సుధాకర్ చెరుకూరి తో మరో సినిమా చేస్తున్నారు. ఎస్ ఎల్ వీ బ్యానర్ పై పీరియాడిక్ డ్రామాగా భారీ బడ్జెట్ తో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మరికొన్ని నెలల్లో ఈ ప్రాజెక్ట్ ను అధికారికంగా ప్రకటించనున్నారు. వీరితో పాటు మరికొంతమంది టాలెంటెడ్ డైరెక్టర్లతో విశ్వక్ సేన్.. చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. త్వరలోనే అన్ని ప్రకటనలు రానున్నాయన్నమాట. మరి విశ్వక్ వరుస చిత్రాలతో ఎలాంటి హిట్లు కొడతారో చూడాలి.



## మీ జుట్టు ఎక్కువ రాలిపోతుందా? అయితే మీ పెరట్లోని ఈ ఆకుల పొడిని తరచుగా వాడండి!!



ఊబకాయం తర్వాత నేడు చాలా మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో జుట్టు రాలడం కూడా ఒకటి. రోజుకి కొంత మొత్తంలో జుట్టు రాలడం సహజం. కానీ నేటి బిజ లైఫ్ స్టైల్ మరియు స్ట్రెస్ తో కూడిన జీవనశైలి మరియు అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో జుట్టుకు ఆరోగ్యానికి మరియు బలానికి అవసరమైన పోషకాలు అందడం లేదు. దీని వల్ల జుట్టు ఎక్కువగా రాలిపోతుంది.నిజానికి ఒక్కసారి తలపై దువ్వెన పెడితే చాలు, దువ్వెన నిండా వెంట్రుకలు ఊడిరావడం చూస్తే చాలా టెన్షన్ పడిపోతుంటాం. ఆ స్థాయిలో జుట్టు బలహీనంగా ఉంటుంది. ఇలా బలహీనమైన వెంట్రుకలకు బలం చేకూర్చేందుకు షాపుల్లో రకరకాల నూనెలు విక్రయిస్తున్నప్పటికీ.. అవి తాత్కాలిక పరిష్కారాన్నే అందిస్తుంది తప్ప శాశ్వత పరిష్కారం కాదు. జుట్టును బలంగా ఉంచడానికి మరియు రాలకుండా ఉండటానికి వివిధ సహజ నూనెలు ఉన్నాయి.అయితే, ఆయుర్వేదంలో వివిధ ఆయుర్వేద పౌడర్లు కూడా ఉన్నాయి, ఇవి జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తాయి మరియు జుట్టు రాలడాన్ని నివారిస్తాయి. మీరు ఈ పౌడర్లతో మీ జుట్టుకు చికిత్స చేస్తే, మొదటి ఉపయోగం బలహీనమైన మీ జుట్టు బలంగా మారుతుంది. ఇప్పుడు జుట్టును బలోపేతం చేయడానికి మరియు జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి సహాయపడే కొన్ని ఆయుర్వేద పౌడర్‌లను మరియు వాటిని ఎలా ఉపయోగించాలో ఇక్కడ చూద్దాం.ఉసిరికాయలో విటమిన్ సి మరియు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి, బూడిద జుట్టును నివారిస్తాయి మరియు జుట్టును మెరిసేలా చేస్తాయి. ఈ ఉసిరికాయ పొడిని నీళ్లతో లేదా పెరుగుతో పేస్ట్‌లా చేసి, తలకు పట్టించి నాననివ్వాలి.మెంతుల్ల ప్రోటీన్ మరియు నికోటినిక్ యాసిడ్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి, ఇవి జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తాయి మరియు జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తాయి. అటువంటి మెంతిపొడిని పెరుగు లేదా నీళ్లతో కలిపి పేస్టులా చేసి జుట్టుకు రాసుకుంటే జుట్టు పటుత్వం పెరిగి జుట్టు రాలడం తగ్గుతుంది.మందారంలో విటమిన్లు, అమైనో ఆమ్లాలు మరియు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ జుట్టు దృఢత్వానికి అవసరమైన పోషకాలు. ఇవి జుట్టు రాలడాన్ని నివారిస్తాయి మరియు శిరోజాల ఆరోగ్యాన్ని కూడా ప్రోత్సహిస్తాయి. అందుకు కుంకుమపువ్వు, నెల్లి పొడి వేసి, పెరుగు లేదా నీళ్లు కలిపి పేస్ట్‌లా చేసి, తలకు పట్టించి నాననివ్వాలి, తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి.వేపకు యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉన్నాయి. ఇవి తలపై ఉండే సూక్ష్మక్రిములను చంపి, చుండ్రు మరియు దురదలను నివారిస్తాయి.

### 5 నిమిషాల్లో గ్లోయింగ్ స్కిన్ పొందడానికి 'ఈ' ఫేషియల్ ప్యాక్ ఉపయోగించండి...!

అందమైన మెరిసే చర్మం కావాలన్నదే అందరి కోరిక. నేడు చాలా మంది తమ ముఖాన్ని, చర్మాన్ని కాంతివంతంగా ఉంచుకోవడానికి అనేక మార్గాలను అనుసరిస్తున్నారు. మార్కెట్‌లో లభించే సరికొత్త క్రీములను ముఖానికి పూయడం, పార్లర్‌కు వెళ్లడం, ఎండకు భయపడి ఎయిర్‌కండీషనర్‌లో ఉండడం వంటి వాటి ప్రయత్నాలే ఉంటాయి. నిజానికి వీటన్నింటిని పాటించడం వల్ల మనకు మెరిసే చర్మం లభించదు. మన చర్మం సహజసిద్ధంగా మెరిసిపోవాలంటే అతిగా చేయాల్సిన అవసరం లేదు. మీరు చేయాల్సిందల్లా మీ దినచర్యలో కొన్ని మార్పులు చేసుకోవడం. ౹బిజీ వర్క్ షెడ్యూల్ నుండి సోమరితనం వరకు, మనలో చాలా ఫేషియల్‌తో సోమరితనం ఉన్నవారు కూడా ఆరోగ్యకరమైన, మెరిసే చర్మాన్ని పొందవచ్చు. ఇక్కడ మీరు మెరిసే చర్మాన్ని పొందడానికి 5 నిమిషాల్లో వేసుకోగలిగే ఫేషియల్ ప్యాక్ గురించి తెలుసుకోవచ్చు. అవసరమైనవి మెరిసే చర్మం మంచి ఆరోగ్యానికి చిహ్నం. మరోవైపు, పొడి లేదా నిస్తేజమైన చర్మం మీ ఉత్తమమైన చర్మం కంటే తక్కువగా ఉంటుంది. మీ చర్మం మెరుస్తూ ఉండటానికి మీరు గంటల తరబడి పార్లర్‌లో గడపాల్సిన అవసరం లేదు; బదులుగా, మీకు సరైన పదార్థాలు అవసరం. అవి రోజ్ వాటర్, టొమాటో, అలోవెరా జెల్ మరియు ముల్తానీ మిట్టి. క్లెన్సింగ్ ముందుగా మీ చర్మంలోని మురికి మరియు చనిపోయిన చర్మ కణాలను శుభ్రపరచడం ద్వారా ప్రారంభిద్దాం. తర్వాత, కొద్దిగా రోజ్ వాటర్ తీసుకుని, మీ చర్మాన్ని శుభ్రం చేయడానికి మీ ముఖమంతా అప్లై చేయండి.


## ఆయుధంతో లారీపై నితిన్.. అదిరింది 'తమ్ముడు'!

టాలీవుడ్ లవర్ బాయ్ నితిన్.. చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. రీసెంట్ గా ఎక్స్ ట్రా ఆర్డినరీ మ్యాన్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చినా మెప్పించలేకపోయారు. గతేడాది చివర్లో రిలీజైన ఈ సినిమా.. డిజాస్టర్ టాక్ అందుకుంది. దీంతో 2024లో గట్టి కమ్ బ్యాక్ ఇవ్వాలని ట్రై చేస్తున్నారు నితిన్. సినిమాల విషయంలో జాగ్రత్తగా అడుగులు వేస్తున్న నితిన్ చేతిలో ప్రస్తుతం రెండు ప్రాజెక్టులు ఉన్న విషయం తెలిసిందే. ఓవైపు భీష్మతో తనకు సూపర్ హిట్ ఇచ్చిన వెంకీ కుడుములతో రాబిన్ హుడ్ మూవీ చేస్తుండగా.. మరోవైపు వేణు శ్రీరామ్ డైరెక్షన్ లో ఇంకో సినిమా చేస్తున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కమ్ బ్యాక్ మూవీ వకీల్ సాబ్ తో సూపర్ హిట్ కొట్టిన శ్రీరామ్.. నితిన్ తో సినిమా చేస్తుండడంతో ఆడియన్స్ లో మంచి అంచనాలు నెలకొన్నాయి. గత ఏడాది ఆగస్టులో పూజా కార్యక్రమాలు నిర్వహించిన మేకర్స్.. కొన్ని రోజుల క్రితం షూటింగ్ మొదలుపెట్టారు. వైజాగ్ లో ఇటీవల ఒక షెడ్యూల్ కూడా పూర్తి చేశారు. ంశ్రీబనీ ఖీవజీట – పిక్ టాక్ : పింక్ మిల్కీ థైస్ అందాల షో నేడు నితిన్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా మేకర్స్ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. నితిన్ ఫస్ట్ లుక్ పోస్టర్ తో పాటు టైటిల్ ను రివీల్ చేశారు. ఈ మూవీ టైటిల్ ను తమ్ముడు గా ఫిక్స్ చేసినట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు



ఈ టైటిల్ నే అధికారికంగా ప్రకటించింది చిత్ర యూనిట్. ఆశయం, ధైర్యం, సంకల్పం యొక్క కథ అంటూ ట్వీట్ చేశారు మేకర్స్. నితిన్ కు స్పెషల్ విషెస్ కూడా తెలిపారు. ఇక పోస్టర్ లో ఆడవాళ్లు డ్రైవ్ చేస్తుంటే లారీపై కుమారస్వామి ఆయుధంతో నితిన్ కూర్చుని సీరియస్ లుక్ లో కనిపిస్తున్నారు. ఆ లారీపై పగడాలమ్మ తల్లి దీవెనలతో అని కూడా రాసింది. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్ ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. కాంతార మూవీకి బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందించిన అంజనీష్ లోక్ నాథ్.. ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. అయితే హీరో నితిన్.. పవన్ కళ్యాణ్ ఫ్యాన్ అన్న విషయం తెలిసిందే. నితిన్ చాలా సినిమాల్లో పవర్ స్టార్ రిఫరెన్స్ లు కనిపిస్తుంటాయి. పలు సినిమాల ఈవెంట్స్ కు ముఖ్యఅతిథిగా పవన్ వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు పవన్ సూపర్ హిట్ మూవీ టైటిల్ తోనే నితిన్ థియేటర్లలోకి రాబోతున్నారు. మరి నితిన్ కు ఈ సినిమా ఎలాంటి హిట్ తెచ్చిపెడుతుందో చూడాలి.

## అందానికే మరో అందం....



## రాశీఖన్నా డ్రీం దర్శకుడు ఆయనే!



దశాబ్ద కాలం క్రితం ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను హీరోయిన్ గా మెప్పించిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు రాశి ఖన్నా కు నటిగా మంచి మార్కులు పడ్డాయి. సౌత్ ఇండస్ట్రీలో ముఖ్యంగా టాలీవుడ్ లో హీరోయిన్ గా రాణించాలంటే సన్నగా నాజూకుగా ఉండాలి. ఆ విషయాన్ని పట్టిన రాశి ఖన్నా కష్టపడి చాలా బరువు తగ్గి బొద్దుగుమ్మ కాస్త ముద్దుగుమ్మ అన్నట్లు తయారు అయ్యింది. ఆమె కోరుకున్నట్లుగానే సన్నగా అయ్యాక యంగ్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కాయి. ప్రస్తుతం సౌత్ తో పాటు బాలీవుడ్ లో కూడా రాశి ఖన్నా ఎక్కువ దృష్టి పెట్టింది. హిందీలో వరుసగా సినిమాలకు కమిట్ అవుతోందిసౌత్‌లో సెటిలైన బాలీవుడ్ స్టార్లు తాజాగా ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. తనకు ఇండస్ట్రీలో ఒక డ్రీమ్ ఉందని, అదే దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వర్క్ చేయాలి. ఆయనతో నేనే కాదు దాదాపు అందరు హీరోయిన్స్ కూడా ఆయన దర్శకత్వంలో ఒక్కసారి అయినా నటించాలని కోరుకుంటారు. ఆయన సినిమాల్లో హీరోయిన్స్ కి ఉండే ప్రాముఖ్యత గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆడవారిని గొప్పగా చూపించే దర్శకుల్లో సంజయ్ లీలా భన్సాలీ ముందు ఉంటారు. ఆయన సినిమాలను విమర్శకులు సైతం మెచ్చుకుంటూ ఉంటారు. అలాంటి గొప్ప దర్శకుడి దర్శకత్వంలో నటించడం అనేది నా కల అంటూ రాశి ఖన్నా చెప్పుకొచ్చింది. ఇక రాశి ఖన్నా ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే... ది సబర్మతీ రిపోర్ట్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీగా ఉంది. మరో వైపు ఫర్జీ అనే వెబ్ సిరీస్ తో ఈ అమ్మడు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఫర్జీ పై రాశి ఖన్నా చాలా నమ్మకం గా కనిపిస్తోంది. ప్రస్తుతానికి తెలుగు లో మాత్రం రాశి ఖన్నా సినిమాలు ఏవీ లేవు.

## ఇలాంటి వాళ్లతో బెంగళూరు ఈసారి కూడా ట్రోఫీ గెలవలేదు: ఇంగ్లండ్ మాజీ ప్లేయర్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఎఖఎ) 2024లో ఎం.చిన్నస్వామి స్టేడియంలో మార్చి 29న జరిగిన పోరులో కోల్‌కతా నైట్ రైడర్స్ (ఐఐఖీ) బ్యాటర్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఖీఅః) బౌలర్లను చిత్తుగా దంచి కొట్టారు.ఐఐఖీ 183 పరుగుల లక్ష్యాన్ని కేవలం 16.5 ఓవర్లలో ఛేదించింది. ఖీఅః పేసర్లు తన నాలుగు ఓవర్ల కోటా నుంచి 23 పరుగులు ఇచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్ విజయ్‌కుమార్ వైషాక్‌ను మినహాయిస్తే.. పేలవంగా తయారయ్యారు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ ఐఐఖీపై ఆర్‌సీబీ ప్రదర్శన తర్వాత హాట్ కామెంట్స్ చేశారు. ఇలాంటి బౌలింగ్‌తో ఫాఫ్ డు ప్లెసిస్ వారి ఐపీఎల్ ట్రోఫీ



కరువును ముగించడం 'అసాధ్యం' అంటూ చెప్పేశాడు.భారత మాజీ పేసర్ ఇర్ఫాన్ పఠాన్ ఖీఅః బౌలింగ్ ఎటాక్ ఆకట్టుకోలేకపోయింది. వారు త్వరగా సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందంటూ చెప్పుకొచ్చాడు.నిజంగా వారి బౌలింగ్‌ను క్రమబద్ధీకరించాలి' అంటూ పఠాన్ చీ లో రాసుకొచ్చాడు.పవర్‌ప్లే ఓవర్లలో డు ప్లెసిస్ స్పిన్నర్లను తీసుకరాలేదు. మహ్మద్ సిరాజ్ తన మొదటి ఓవర్‌లో ఫిలిప్ సాల్ట్ దూకుడుతో రెండు సిక్స్‌లు, ఒక ఫోర్‌తో సహా 18 పరుగులు ఇచ్చాడు. సునీల్ నరైన్ కూడా అల్జారీ జోసెఫ్‌పై రెండు సిక్సర్లను బాదేశాడు. అతను యశ్ దయాల్ తర్వాత ఒక ఫోర్, రెండు సిక్సర్లు బాదాడు. పవర్‌ప్లే ఓవర్ల తర్వాత ఐఐఖీ వికెట్ నష్టపోకుండా 85 పరుగులు చేసింది.వరుస ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయిన ఆర్‌సీబీ తిరిగి పునరాగమనం చేయలేకపోయింది. జోసెఫ్ తిరిగి వచ్చాడు. కానీ, వెంకటేష్ అయ్యర్ దెబ్బకు రెండు సిక్సర్లు, రెండు ఫోర్లు ఇచ్చేశాడు. సిరాజ్ మూడు ఓవర్లలో 46 పరుగులు చేశాడు. దయాల్ తన నాలుగు ఓవర్ల కోటాలోనూ ఇలాగే దెబ్బతిన్నాడు. జోసెఫ్ కేవలం రెండు ఓవర్లు వేసి 34 పరుగులు ఇచ్చాడు. కామెరాన్ గ్రీన్ అతను వేసిన ఒకే ఓవర్లో కేవలం ఏడు పరుగులు మాత్రమే ఇచ్చాడు.పవర్‌ప్లే ఓవర్లలో ఎడమచేతి వాటం స్పిన్నర్ మయాంక్ డాగర్‌ను ప్రవేశపెట్టకూడదనే తన నిర్ణయాన్ని డు ప్లెసిస్ సమర్థించుకున్నాడు."ఆట ముగిసిన తర్వాత మీరు ఎప్పుడైనా తెలుసుకోవచ్చు. మేం బహుశా ఒకటి లేదా రెండు విషయాలను ప్రయత్నించవచ్చు. కానీ వారిద్దరూ (నరైన్, సాల్ట్) బంతిని కొట్టే విధానం మా బౌలర్లపై ఒత్తిడి తెచ్చారు. వారు బలమైన క్రికెట్ షాట్లను ఆడారు. చాలా చక్కని ఆటతో మాకు విజయాన్ని దూరం చేశారు. మొదటి ఆరు ఓవర్లలో ఆటను నిజంగా బ్రేక్ చేశారు" అంటూ మ్యాచ్ తర్వాత ఆర్‌సీబీ సారథి చెప్పుకొచ్చాడు.

### 'ఇది కేవలం నటన.. ఆ ఇద్దరికి ఆస్కార్ ఇవ్వాల్సిందే'.. కోహ్లీ, గంభీర్ వీడియోపై గవాస్కర్ సంచలన కామెంట్స్

2024లో బెంగళూరు వర్సెస్ కోల్‌కతా (ఖీఅః లబ ఐఐఖీ) మధ్య జరిగిన మ్యాచ్‌లో, అభిమానులు బహుశా అస్సలు మరిచిపోలేరు. ఖీఅః ఇన్నింగ్స్ సమయంలో విరాట్ కోహ్లీ, గౌతమ్ గంభీర్ ఒకరినొకరు కౌగిలించుకోవడం కనిపించింది.ఈ దృశ్యాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అయితే, మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఇది కేవలం నటన అని, దీనికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలంటూ బాంబ్ పేల్చాడు.ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ, గౌతమ్ గంభీర్ మధ్య రెండుసార్లు వాగ్వాదం జరిగింది. గంభీర్ కేకేఆర్ కెప్టెన్‌గా, విరాట్ కోహ్లీ ఆర్‌సీబీ కెప్టెన్‌గా ఉన్నప్పుడు తొలిసారి ఇద్దరు ఆటగాళ్ల మధ్య గొడవ జరిగింది. గత సీజన్‌లో కూడా, గౌతమ్ గంభీర్ ఐఐఖీ మెంటార్‌గా ఉన్నప్పుడు, మ్యాచ్ తర్వాత మైదానంలో ఇద్దరు దిగ్గజాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ కారణంగా, ఐఐఖీ వర్సెస్ ఖీఅః మధ్య మ్యాచ్ ఎప్పుడు జరుగుతుందోనని అంతా ఎదురుచూసేవారు. కానీ, ఈసారి మాత్రం అలా జరగలేదు.అయితే, ఈసారి మ్యాచ్‌లో అలాంటిదేమీ జరగలేదు. ఖీఅః ఇన్నింగ్స్ సమయంలో, అభిమానులు ఎవరూ ఊహించని దృశ్యాన్ని చూశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.